క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు



రాపూరు : విశేషాలంకరణలో రామనాథేశ్వరస్వామి

రాపూరు : కార్తీక మాసం, కార్తీక అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం రాపూరులోని రామనాథేశ్వరస్వామి, పర్వతివర్ధని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే స్వామి, అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చన, పూలంగి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

నిత్యావసర సరుకుల వితరణ



నిత్యావసరాలు అందజేస్తున్న వైద్యులు, సంస్థ సభ్యులు

గూడూరు రూరల్ : గూడూరు ఏరియా ఆస్పత్రిలో ఆదివారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ బాధితులకు డాక్టర్ జనార్దనరెడ్డి, రోహిణి నిత్యావసర సరుకులు అందజేశారు. వైద్యులు మాట్లాడుతూ క్షణికావేశంలో చేసే తప్పుల వల్ల ఎయిడ్స్ వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి వారికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించేందుకు డాక్టర్ సీఆర్ రెడ్డి జ్ఞాపకార్థం ఆరోగ్య సంజీవని పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగానే ఈ నెల చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని దుప్పట్లు, సరుకులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ తనూజా, కార్యదర్శి అనిత, ఆంధ్రా మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు విష్ణువందన, శశికళ, కాటూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

కలువాయి: కలువాయిలోని రాజరాజేశ్వరి సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక అమావాస్య అనూరాధ నక్షత్ర పర్వదినం సందర్భంగా సామూహిక రుద్రాభిషేకాన్ని శివభక్త మండలి నిర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. అనంతరం నీలకంఠేశ్వర స్వామి వృత్తికా శివలింగానికి సామూహికంగా గంగాజలంతో అభిషేకం చేశారు. శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి సామూహికంగా నాగసింధూరంతో దేవి ఖడ్గమాల పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఉప్పటేరును దాటొద్దు



ఉప్పటేరు వద్ద వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్

చిల్లకూరు : మండలంలో తిప్పగుంటపాళెం సమీపంలో ఉన్న ఉప్పటేరు వరద నీరు ఆదివారం రాత్రికి చప్టాపైన ప్రవహించే ప్రమాదం ఉందని, గ్రామస్తులు అటువైపు వెళ్లొద్దని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఆదివారం రెవెన్యూ సిబ్బందితో కలిసి ఉప్పుటేరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఫెంగల్ తుపాను ప్రభావం తగ్గినప్పటికీ ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు ఎక్కువగా వస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఉప్పటేరుకు వరద పెరుగుతోందన్నారు. రాత్రికి ఎక్కువగా పెరిగే అవకాశం ఉండడంతో రాకపోకలను నిలిపేస్తున్నట్టు తెలిపారు. ఓడూరు వీఆర్వో సుబ్రహ్మణ్యం, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సేవకు ప్రశంసలు



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న సహదేవయ్య

నాయుడుపేట టౌన్ : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా తిరుపతి ఎస్వీ ఆడిటోరియంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో నాయుడుపేట నవజీవన్ సీసీ పీఎం ప్రాజెక్టుకు ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు అందినట్టు ఆ సంస్థ ప్రెసిడెంట్ కే సహదేవయ్య తెలిపారు. ఎయిడ్స్ నివారణ చర్యల్లో భాగంగా తమ సంస్థ నిర్వహించిన పలు కార్యక్రమాలకు తిరుపతి జిల్లా డీఎం అండ్ హెచ్‌వో శ్రీహరి, డీఎల్‌ఏటీవో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, బహుమతులు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ, సిబ్బంది కవిత, మంజుల, నందిని, శ్రావణి, సాయి తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: పూలతోట వద్ద కన్నాకాలువ ప్రవాహం, వెంకటగిరి రూరల్ : కైవల్యానదిలో నీటి ప్రవాహం, దొరవారిసత్రం తనియాలి వద్ద కాళంగి నదిపై మునిగిపోయి బ్రిడ్జి, చిట్టమూరు : మల్లాం వద్ద రోడ్డుపై కంప వేస్తున్న సిబ్బంది, వాకాడులో స్వర్ణముఖి ప్రవాహం











స్వర్ణమ్మ పరుగులు

- నీట మునిగిన పంట పొలాలు
- అప్రమత్తమైన అధికారులు
- గ్రామాలకు రాకపోకల నిలిపివేత
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దొరవారిసత్రం/ఓజిలి/రాపూరు/వెంకటగిరి రూరల్/బాలాయపల్లి(సైదాపురం)/దక్కిలి/నాయుడుపేటటౌన్/సైదాపురం/కోటచిట్టమూరు(చిల్లకూరు)/పెళ్లకూరు/గూడూరు రూరల్/వాకాడు/సూళ్లూరుపేట రూరల్ : ఫెంగల్ తుపాన్ ప్రభావతంలో కురిసిన భారీ వర్షాలకు సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లోని పలు నదులు, కాలువలు ప్రవహిస్తున్నాయి. స్వర్ణముఖి నది ఉద్ధృతం కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అటువైపు ప్రజలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వాహనాల రాకపోకలను నిలిపేశారు.

■ దొరవారిసత్రం మండలంలోని నెర్రికాలువ, పాల కాలువ, కన్నాకాలువ ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. చెరువులు నిండాయి. కాళంగి నది వరద నీటితో తనియాలి రోడ్డులోని బ్రిడ్జి నీట మునిగిపోయింది. తనియాలి, కమ్మకండ్రిగ, కొత్తకండ్రిగ, బూదూరు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పాలకాలువ ప్రవాహానికి కుప్పారెడ్డిపాళెం గ్రామం వద్దనున్న బ్రిడ్జి మునిగిపోవడంతో వెదురుపట్టు, వెదురుపట్టురాజుపాళెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దొరవారసత్రం, అక్కరపాక, మినమనముడి, నెలబల్లి, పోలిరెడ్డిపాళెం, మేలుపాక గ్రామాల సమీపంలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలు నిండిపోయాయి. దీంతో మినమనముడి, దొరవారిసత్రం, మేలుపాక గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

■ ఓజిలి మండలంలోని మానమాల, పున్నేపల్లి గ్రామాల వద్ద మామిడి కాలువ పొంగిపొర్లుతోంది. చప్టాలపై నీరు ప్రవహిస్తుండడంతో నెమళ్లపూడి, సగుటూరు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. చెరువులు నిండాయి.

■ రాపూరు మండలంలోని కొండేరు కాలువ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

■ వెంకటగిరి పట్టణం, రూరల్ ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కైవల్యా నది, గొడ్డేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. వ్యవసాయ పొలాల్లో నీరు నిలవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



పెళ్లకూరు : కప్పగుంటకండ్రిగ కాజ్‌వేపై స్వర్ణముఖినది వరద ఉద్ధృతి

■ బాలాయపల్లి మండలంలో వర్షాలు కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నిండలి వద్దనున్న కాజ్‌వే మీదుగా కైవల్యా నది ప్రవహిస్తుండడంతో అధికారులు వాక్యాం, నిండలి, డక్కిలి మండలం దగ్గవోలు గ్రామాలకు రాకపోకలను నిలిపేశారు. ఎస్‌ఐ గోపి కాజ్‌వే వద్ద తమ సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశారు.

■ డక్కిలి మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. చెరువుల్లోకి నీరు చేరుతోంది.

■ సైదాపురం సమీపంలో కైవల్యానది జోరుగా ప్రవహిస్తోంది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పొలాల్లో నీరు నిలిచింది.

■ నాయుడుపేటలో స్వర్ణముఖి నది ప్రవాహం పెరిగింది. ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని సరదాగా గడిపారు. తిరుపతి సమీపంలో కల్యాణి డ్యామ్ గేట్లు ఎత్తుతున్నట్టు సమాచారం అందడంతో సీఐ బాబి, తహసీల్దార్ రాజేంద్ర, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా నది వద్దకు చేరుకుని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అదే విధంగా మామిడి కాలువ ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. నాయుడుపేట పట్టణంలోని కాలువలు పొంగి మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

■ కోట మండలంలోని స్వర్ణముఖి చల్ల కాలువకు వరద నీటి ప్రవాహం పెరిగింది. పలు చెరువులు నిండాయి. పెన్నక్క చెరువుకు నీరు చేరుతుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. తహసీల్దార్ జయజయరావు పెన్నక్క చెరువును పరిశీలించారు. చెరువు కట్ట బలహీనంగా ఉన్న చోట తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మండలంలోని 23 చెరువులు పూర్తిగా నిండినట్లు తెలిపారు. భారీ వర్షాల కారణంగా తిన్నెలపూడి, వెంకన్నపాళెం, వంజివాక, లక్ష్మక్కకండ్రిగలో వరినాట్లు నీట మునిగినట్లు రైతులు తెలిపారు.

■ చిట్టమూరు మండలంలోని మల్లాం- నాయుడుపేట రోడ్డులో రొయ్యల వాగు వద్ద బ్రిడ్జిపై స్వర్ణముఖి నది నీరు ప్రవహిస్తుండడంతో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. రోడ్డుకు అడ్డంగా కంప వేసి రాకపోకలను నిలిపేశారు.



నాయుడుపేట వద్ద ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది

■ పెళ్లకూరు మండలం కొత్తూరులోని కొర్రపాటి చెరువుకు గండి పడి నీరు వెళుతుండడంతో వరినాట్లు నీట మునిగాయి. కలవకూరు చెక్‌డ్యామ్, కప్పగుంటకండ్రిగ కాజ్‌వేలపై స్వర్ణముఖి నది వరద ఉద్ధృతి తీవ్రంగా ఉంది. కలవకూరు, పిడికిటిమాల, యడపూడి, అనకవోలు, పెరుమాళ్లపల్లి, జంగాలపల్లి, పాలచ్చూరు, కప్పగుంటకండ్రిగ, దిరసనమాల గ్రామాలకు రాకపోకలను నిలిపేశారు. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఎస్‌ఐ నాగరాజు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. చవటకండ్రిగ, ఎగువతాగేలి, చిల్లకూరు, దొడ్లవారిమిట్ట, శిరసనంబేడు గ్రామాల్లోని దళితకాలనీల చుట్టూ వరదనీరు చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

■ గూడూరు సమీపంలోని పంబలేరు చప్టాపై కైవల్యా నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గూడూరు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఆదివారం అక్కడికి చేరుకుని వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

■ వాకాడు మండలంలో స్వర్ణముఖి నదిలో భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో అధికారులు నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. బాలిరెడ్డిపాళెం వద్ద తెగిపోయిన కరకట్ట వద్ద ఇసుక బస్తాలు వేశారు. బాలిరెడ్డిపాళెం, గంగన్నపాళెం గ్రామాల మధ్య రాకపోకలను నిలిపేశారు. కాశీపురం సమీపంలోని బసమ్మకండ్రిగ స్వర్ణముఖి నది ప్రవాహం పెరగడంతోతో ప్రజలను అటువైపు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

■ సూళ్లూరుపేట రూరల్‌లో కాళంగి రిజర్వాయర్ 11 గేట్లు ఎత్తేయడంతో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో ఉన్న విస్తరించి ఉన్న కాళంగి నదిలో నీటి ప్రవాహం ఉద్ధృతంగా మారింది.



చిల్లకూరు: కోరాపాళెం కాలనీని చుట్టుముట్టిన వర్షపు నీరు



దొరవారిసత్రం: వెదురుపట్టులో పాలకాలువ ప్రవాహ ఉద్ధృతి



పెళ్లకూరు : దొడ్లవారిమిట్టలో ఇళ్ల చుట్టూ చేరిన వర్షపు నీరు



సూళ్లూరుపేట రూరల్ : ఉద్ధృతంగా ప్రవహిస్తున్న కాళంగి నది



నాయుడుపేట టౌన్ : ఉద్ధృతంగా ప్రవహిస్తున్న మామిడి కాలువ



సైదాపురం మండలంలో నీట మునిగిన పంట పొలాలు

తగ్గిన తుపాను తాకిడి

చిల్లకూరు : మండలంలో ఆదివారం వేకువజాము నుంచి తుపాను తాకిడి కొంత మేర తగ్గింది. అప్పుడప్పుడూ మోస్తరుగా వర్షం కురుస్తూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కాలనీల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోరావారిపాళెంలోని కాలనీని వర్షపు నీరు చుట్టుముట్టింది. పొలాల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచింది. కొన్ని ప్రాంతాల్లో నాటిన నారుమడులు నీటితో నిండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తీర ప్రాంతంలోని తీగపాళెం సమీపంలో బంగాళాఖాతంలో అలలు ఉద్ధృతి తగ్గలేదు. అధికారులు కూడా హెచ్చరికలు జారీ చేయడంతో అటువైపు ఎవరూ వెళ్లడం లేదు. మత్స్యకారులు పడవలను ఒడ్డుకే పరిమితం చేశారు. మండలంలోని ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినింది.



గుమ్మళ్లదిబ్బ వద్ద ఒడ్డుకే పరిమితమైన బోట్లు

నీట మునిగిన పంట పొలాలు



సూళ్లూరుపేట రూరల్ : గోకుల కృష్ణ ఇంజినీరింగ్ కళాశాల వద్ద నీట మునిగిన పంట పొలాలు

సూళ్లూరుపేట రూరల్ : ఫెంగల్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు వరి, మిరప పంటలు దెబ్బతిన్నాయి. సూళ్లూరుపేట మండలంలోని గోకులకృష్ణ కళాశాల, మంగళపాండు, వెంగళాపూరం, ఇలుపూరు, దామానెల్లూరు, కోటపోలూరు, ఉగ్గుముడి, సుగ్గుపల్లి పంచాయతీల్లో సుమారు 1,020 ఎకరాల్లోని పంట నీట మునిగింది. ఉగ్గుముడి, మతకాముడి, సుగ్గుపల్లి ప్రాంతాల్లో వంద ఎకరాల్లోని మిరప పంట దెబ్బతినింది. వ్యవసాయ అధికారులు నీట మునిగిన పంటలను పరిశీలించి నష్టంపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. వర్షం వల్ల ఇలుపూరు - తుంగమడుగు రోడ్డు, ఎన్‌వీకండ్రిగ, కోటపోలూరు- కోట, వాకాడు రోడ్లు గుంతలుగా మరాయి.

7న అఖండ జ్యోతి పూజోత్సవం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని గాంధీ పార్కు సమీపంలో ఈ నెల 7, 8 తేదీల్లో భగవాన్ అయ్యప్ప స్వామి అఖండ జ్యోతి పూజోత్సవాన్ని నిర్వహించనున్నట్టు అయ్యప్ప స్వామి సేవా సంఘం అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 43వ అఖండ జ్యోతి పూజోత్సవాన్ని ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండడంతో వాయిదా వేసి 7, 8 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. గణపతి హోమం, కలశాల ఊరేగింపు, రాత్రి అఖండ కర్పూర జ్యోతిని నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం అయ్యప్ప స్వామి నగరోత్సవాన్ని చేపడతామన్నారు. 8వ తేదీ మధ్యాహ్నం అన్నదానంతో వేడుకలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో భగవాన్ అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు జలదంకి వెంకటకృష్ణారెడ్డి, పాపాడి చంద్రారెడ్డి, ఎం.జలందర్, జి.రాజశేఖర్, డీసీ యతీంద్ర, ఈహెచ్ అంకయ్య తదితరుల పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలకు తరలిన కార్యకర్తలు

చిల్లకూరు : ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేలా తీర్మానాలు చేసేందుకు సత్యవేడులో ఆదివారం నిర్వహించిన జిల్లా మహాసభలకు గూడూరు నుంచి సుమారు 55 మంది సీపీఎం నాయకులు తరలివెళ్లారు. సీపీఎం సీనియర్ నాయకుడు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు అందజేస్తున్నట్టు ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. అర్హులకు ఒక్క పథకమూ అందలేదని రోపించారు. సత్యవేడులో డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహిస్తున్న 14వ జిల్లా మహాసభల్లో ప్రభుత్వ తీరును ఎండగడతామన్నారు. ఇసుకను ఉచితంగా ఇస్తున్న ట్టు ప్రకటనలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నా రని దుయ్యబట్టారు. ఉపాధి హామీ పనుల్లో కొలతలను బూచిగా చూపి పేదల కడుపుకొడుతున్నారని విమర్శించారు. ప్రాంతీయ ఆర్గనైజర్ జోగి శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పడి పూజోత్సవం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో వున్న రాఘవేంద్ర భవన్ వద్ద ఆదివారం అయ్యప్పస్వామి పడి పూజోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా రూరల్ అధ్యక్షుడు కనమర్లపూడి సుబ్రమణ్యం, జ్యోతిరాణి కుటుంబ సభ్యులు అయ్యప్ప మాలధారులకు పాదపూజ చేశారు. పద్దెనిమిది మెట్లు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కనమర్లపూడి రమేష్ బాబు, వెంకటేశ్వరరావు, సురేంద్రనాథ్ గుప్త, అనూష, భగవాన్ అయ్యప్ప స్వామి సేవా సంఘ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, ఆవుల లోకేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కండలేరులో 53.644 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 53.644 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి 4,810 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 2150 క్యూసెక్కుల నీరు వస్తుందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 850, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మొదటి అడ్వెంట్



చిన్నారులతో సంఘ కాపరి దేవిడ్ ప్రశాంత్‌రాజ్

చిల్లకూరు : గూడూరులోని పరిశుద్ధ పౌలు పేతురు లూథరన్ చర్చిలో ఆదివారం మొదటి అడ్వెంట్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రిస్మస్‌కు ముందు వచ్చే తొలి ఆదివారాన్ని మొదటి అడ్వెంట్‌గా పరిగణించి ప్రత్యేక ప్రార్థనలు చేయడం, పిల్లలతో బైబిల్‌లోని వాక్యాలను చదివించడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే గూడూరులోని పరిశుద్ధ పౌలు పేతురు లూథరన్ చర్చిలో సంఘ కాపరి రెవరెండ్ డేవిడ్ ప్రశాంత్‌రాజ్ దైవ సందేశాన్ని వినిపించారు. అదేవిధంగా చిల్లకూరు మండలంలోని అన్ని సౌత్ ఆంధ్రా లూథరన్ సంఘాల్లోనూ సంఘ కాపరులు తొలి అడ్వెంట్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఓజిలిలో..

ఓజిలి : ఓజిలిలోని సౌత్ ఆంధ్రా లూథరన్ చర్చిలో ఆదివారం ప్యారిస్ చర్చి పాస్టర్ రెవరెండ్ రాజరత్నం ఆధ్వర్యంలో తొలి అడ్వెంట్‌ను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ రాజరత్నం దైవ సందేశం ఇచ్చారు. అనంతరం కేక కట్ చేసి చిన్నారులకు పంచి పెట్టారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ మరమ్మతులు

నాయుడుపేట టౌన్ : తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ అంతరాయం లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు ఏపీఎస్‌పీ డీసీఎల్ డీఈ వరప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద ఈఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 24 గంటలూ సేవలు అందించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాయుడుపేటతో పాటు పెళ్లకూరు, ఓజిలి మండలాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. తమ సిబ్బందితో అప్పటికప్పుడు పనులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించామన్నారు. తుపాను వల్ల ఇప్పటి వరకు విద్యుత్‌శాఖకు పెద్దగా నష్టం జరగలేదన్నారు.

ప్రమాదపుటంచున చెరువు కట్టలు



మానేరి గ్రామంలోని చెరువు కట్ట దుస్థితి

దొరవారిసత్రం : ఫెంగల్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు దొరవారిసత్రం మండలంలోని పలు చెరువులు నిండాయి. ముఖ్యంగా కట్టువాపల్లి, మానేరి, పూలతోట, పోలిరెడ్డిపాళెం, పాళెంపాడు, నెలబల్లి, మేలనాలత్తూరు, సింగనాలత్తూరు, మీజూరు తదితర గ్రామాల చెరువు కట్టలు బలహీనంగా ఉన్నాయి. కట్టలు బలహీనంగా ఉండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా మానేరి, కట్టువాపల్లి, పాళెంపాడు తదితర చెరువు కట్టలు వర్షానికి కోతకు గురయ్యాయి. మరొక రోజు భారీ వర్షం కురిస్తే కట్టలకు గండ్లు తప్పవని రైతులు చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి ప్రమాదం అంచున వున్న చెరువు కట్టలను బలోపేతం చేయాలని కోరుతున్నారు.

పింక్ రిబ్బన్‌పై అవగాహన



పింక్ రిబ్బన్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గూడూరు రూరల్ : ప్రతి ఒక్కరు వివాహానికి ముందు హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలని ఐసీటీసీ కౌన్సిలర్ పీవీ విజయకుమార్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గూడూరులోని ఏరియా ఆస్పత్రి, ఐసీటీసీ కేంద్రం, మండల న్యాయ సేవాసంస్థ, సార్డ్స్, కామిల్ సంస్థలు సంయుక్తంగా ఎయిడ్స్ తోపాటు పింక్ రిబ్బన్‌పై అవగాహన కలిగించారు. విజయకుమార్ మాట్లాడుతూ యువతీ యువకులు హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎయిడ్స్ నుంచి రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు అరవ పర్వతయ్య, మహబూబ్‌బాషా, ల్యాబ్ టెక్నీషియన్ జయలక్ష్మి, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్లు రామాంజనేయులు, కామెల్, సార్డ్స్ ప్రతినిధులు సుహాసిని, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.